క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లి గేట్‌లో గ్రామదేవతలు బొడ్రాయి పూజల్లో భాగంగా శనివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు.

విద్యార్థికి అభినందనలు



అభినందిస్తున్న డైరెక్టర్ అశోక్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఫైనలియర్ చదువుతున్న స్వప్న అనే విద్యార్థిని టెక్‌మహీంద్ర క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ప్రతిభ చూపి ఉద్యోగం సాధించింది. శనివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగనేశన్ అభినందించారు. స్వప్న టెక్‌మహీంద్రలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం పొందినట్లు వారు తెలిపారు. ఏవో సురేశ్, స్వామి, ఆరీఫ్ ఉన్నారు.

చీమలపేటలో వైద్య శిబిరం

జూలపల్లి: గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుని జ్వరాలు ప్రబలకుండా సహకరించాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండలంలోని చీమలపేటలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జ్వర పీడితుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటా జ్వర పీడితుల వివరాలు నమోదు చేస్తూ, జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో హెచ్‌వీ వసంత, ఏఎన్‌ఎంలు అరుణ, అనంతరావ్ ఉన్నారు.

నియామకం



రంగు రాజేశం

పెద్దపల్లిరూరల్: బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగు రాజేశంను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నోముారి శ్రీధర్‌రావు తెలిపారు. జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన రాజేశం జిల్లాలో బీసీ యువతను సంఘటితం చేసేందుకు పాటుపడతారనే నమ్మకంతో బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో భక్తులు నవగ్రహ పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు పూజారి మహేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. శివాలయం కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

ఫెర్టిలైజర్‌సిటీ: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆదివారం గౌరవ సత్కారం నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజిపల్లిలోని శ్రీమయి కన్వెన్షన్ హాల్‌లో సత్కారం నిర్వహిస్తామని తెలిపారు.

గోదావరిఖనిలో చేప మందు పంపిణీ



చేప మందు వేస్తున్న కుమార్

గోదావరిఖనిటౌన్: మృగశిర కార్తె సందర్భంగా శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఉదయం చేప మందు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పంపిణీదారు ఒంటెద్దు కుమార్ మాట్లాడుతూ 40ఏళ్లుగా గోదావరిఖని పరిసర ప్రాంత ప్రజలకు చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గతంలో తన తండ్రి ఆయుర్వేద డాక్టర్ ఒంటెద్దు పర్శరాములు చేప ప్రసాదం పంపిణీ చేశారని, ఆయన తదనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. మూలికలతో ఈ ప్రసాదాన్ని తయారు చేస్తున్నామని వివరించారు.

శిథిలావస్థలో గ్రంథాలయం

- ఇరుకు గదిలో నిర్వహణ
- వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు
- నూతన భవనం నిర్మించాలని పాఠకుల విన్నపం



కాల్వశ్రీరాంపూర్ గ్రంథాలయం

కాల్వశ్రీరాంపూర్: పుస్తకాలు విజ్ఞానాన్ని పెంచుతాయి. అలాంటి పుస్తకాలు ఉన్న గ్రంథాలయాలు పాలకులు, అధికారుల ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రంలో 50ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన గ్రంథాలయం నేడు శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదిలో నిర్వహిస్తున్న ఈ గ్రంథాలయం గది పైకప్పు ఎప్పుడు పెచ్చులూడుతుందో అని పాఠకులు భయపడుతున్నారు. గది ఇరుకుగా ఉండడంతో కుర్చీలు వినియోగించుకోలేక మూలన పడేశారు. వృద్ధులు, మహిళలు, యువత ఏకాగ్రతతో కూర్చుండేందుకు వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ లైబ్రేరియన్ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. 30 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగి సంపత్ లైబ్రరీ నిర్వహిస్తున్నాడు. గ్రంథాలయం కోసం నూతన భవనం నిర్మించి వసతులు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

పక్కా భవనం నిర్మించాలి



మండల కేంద్రంలో ఉన్న ఈ గ్రంథాలయం ఎప్పుడు కూలుతుందో తెలియని అయోమయంలో ఉంది. భయం భయంగా గ్రంథాలయంలో దిన వారపత్రికలు చదువుకుంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం పక్కా భవనం నిర్మాణం చేయాలి. – శ్యాం, పాఠకుడు, పెద్దంపేట

ఇరుకుగదిలో ఇబ్బంది



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత ఏకాగ్రతతో చదువుకునేందుకు అవకాశం లేదు. ఒకరు గదిలో ఉంటే మరొకరు వరండాలో ఉండి చదువుకోవాలిసి వస్తుంది. అధికారులు పట్టించుకోవాలి.

– చిలుముల రాజేశ్, పందిల్ల, పాఠకుడు

అందుబాటులో పుస్తకాలు



పాఠకులకు కావలసిన వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేల మ్యాగజిన్స్ అందిస్తున్నాము. గ్రంథాలయం శిథిలావస్థకు చేరకుంది.

– సంపత్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

గని ప్రమాదాలపై విచారణ జరపాలి



కార్మికుడిని పరామర్శిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణి బొగ్గుగనుల్లో జరుగుతున్న ప్రమాదాలపై బహిరంగ విచారణ జరపాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఓసీపీ–3లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడిన శ్రావన్‌కుమార్‌ను ఆయన పరామర్శించారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రామగుండం రీజియన్‌లో ప్రమాదాలు పెరిగిపోయాయన్నారు. జీడీకే–11గని, ఓసీపీ–1,3, ప్రాజెక్టులో వరుస ప్రమాదాలు జరిగాయన్నారు. ఈ ఘటనలపై యాజమాన్యం విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులపైన చర్యలు తీసుకొని, అధికారులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని ఆరోపించారు. నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామ్మూర్తి, చల్ల రవీందర్‌రెడ్డి ఉన్నారు.

గోవధ నిషేధ చట్టాలు అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న సమితి సభ్యులు

జ్యోతినగర్: దేశంలో గోవధ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని రామగుండం సీఐ అజయ్‌బాబుకు వినతిపత్రం అందించారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం పోలీస్‌స్టేషన్ ఆవరణలోని సర్కిల్ కార్యాలయంలో రామగుండం సీఐకి హిందూ ఉత్సవ సమితి సభ్యులు వినతిపత్రం అందించారు. గోవధ చట్టాలను అమలు చేయాలని, అక్రమంగా గోవులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పైతరి రాజు, బందారపు భూపతి, మేకల మహేందర్, నవీన్, సంజీవ్, ఉమాశంకర్, భాస్కర్, సాయి, అరవింద్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

ధర్మారం: గోవులను కాపాడేందుకు ప్రభుత్వ అమలు చేస్తున్న చట్టాలను పోలీసులు అమలు చేయాలని కోరుతూ బజరంగ్‌దళ్ సభ్యులు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైకి వినతిపత్రం అందించారు. జిల్లా అనుమతి లేకుండా కొనసాగుతున్న గోవధ శాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. 17న బక్రీద్ నేపథ్యంలో గోహత్యలు జరిగే అవకాశం ఉందని, దీని నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దల్ జిల్లా సహాయ సంయోజక్ జుంజిపెల్లి దిలీప్, సతీశ్, సునీల్, అజయ్, అనిల్ అభిరామ్, సాయిగోపాల్ పాల్గొన్నారు.

రాజీమార్గమే ఉత్తమం



సుల్తానాబాద్: లోక్ అదాలత్‌లో జడ్జి రాణి



గోదావరిఖనిటౌన్: మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

సుల్తానాబాద్: రాజీమార్గమే రాచ మార్గమని మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి రాణి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో శనివా రం లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, క్షణికావేశంలో చేసిన నేరాలకు పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురికాకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 100 కేసులు పరిష్కంచినట్లు జడ్జి తెలిపారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధానకార్యదర్శి జోగుల రమేశ్, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు ఎస్సైలు శ్రీధర్, ఓంకార్‌యాదవ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

గోదావరిఖనిటౌన్: లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం అందుతుందని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల అన్నారు. అదనపు జిల్లా న్యాయస్థానం, మున్సిఫ్ కోర్టులో శనివారం వేర్వేరుగా నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్‌లో వారు మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీకుదుర్చుకున్న కేసులకు అప్పీళ్లకు వెళ్లే అవకాశం ఉండదని న్నారు. మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు రవీందర్, నహీదా ఫర్వీన్, లోక్ అదాలత్ సభ్యులు ఎస్.కిషన్‌రావు, గుర్రాల రాజేందర్, కొననూరి సతీశ్, గాదె శ్రీలత, న్యాయవాదులు పాల్గొన్నారు.

269 కేసులు పరిష్కారం

మంథని: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించి న జాతీయలోక్ అదాలత్ ద్వారా 269 కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే రూ. 1,10,820 జరిమానా విధించారు. ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ ధ్రు, మంథని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, ఏపీపీ ప్రణయ్, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలను పరిశీలిస్తున్న ఏఈ మహేందర్‌రెడ్డి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో విద్యుత్ స్తంభాలు సక్రమంగా లేకపోవడంతో నిత్యం విద్యుత్ సమస్యతో కాలనీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌శాఖ ఏఈ మహేందర్ రెడ్డి శనివారం కాలనీలో విద్యుత్ సమస్యపై సర్వే చేశారు. కాలనీలో విద్యుత్ సమస్యలు రాకుండా మరమ్మతు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆసిఫ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన వార్షిక వేడుకలు



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

పాలకుర్తి: మండలంలోని ఘన శ్యాందాస్‌నగర్ గ్రామంలో శనివారం బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లికి చెందిన ప్రముఖ వేదపండితులు రమణాచార్యులు ఆధ్వర్యంలోని ముగ్గురు పూజారులతో కూడిన బృందం పాల్గొని ప్రత్యేక హోమం నిర్వహించి, విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి శ్రీరామోజు తిరుమలాచారి, స్థానికులు సంపంగి కుమార్, కొమిరె సురేశ్, లింగస్వామి పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన సేవలు అందించాం



మాట్లాడుతున్న సూర సమ్మయ్య

పాలకుర్తి: కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికసంఘం ఆధ్వర్యంలో గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కార్మికులకు మెరుగైన సేవలు అందించామని కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య అన్నారు. శనివారం కేశోరాం కంపెనీలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 47 మంది కాంట్రాక్ట్ కార్మికులకు బేసిక్ కార్మికులుగా పదోన్నతి కల్పించామని, ప్రస్తుతం మరో 25 మందికి బేసిక్ కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా కార్మికులకు చెల్లించే బోనస్‌ను గతంలో మాదిరిగా వాయిదాల రూపంలో కాకుండా ఏకకాలంలో రూ.34వేలు ఇప్పించిన ఘనత తమ యూనియన్‌కే దక్కుతుందన్నారు. భవిష్యత్‌లో కార్మికుల సమస్యల సాధన కోసం ముందుండి పోరాడుతామని హామీ ఇచ్చారు. నాయకులు దాడి పోచమల్లు, దుర్గం జగన్, ముల్కల రాజేశం, తిప్పని శ్రీనివాస్, రెడపాక మల్లేశ్, తలారీ శంకర్ పాల్గొన్నారు.

జోరుగా చేపల విక్రయాలు



చేపలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



చేపలు పడుతున్న మత్స్యకారులు

కాల్వశ్రీరాంపూర్: మృగశిర కార్తె రోజు గొంతులో చేపముల్లు దిగాల్సిందేనన్న నానుడితో కార్తె ప్రారంభం రోజు శనివారం మండలంలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఆయా గ్రామాల్లో చెరువులు కుంటల్లో మత్స్యకారులు వలవేసి చేపలు పట్టి విక్రయించారు. వినియోగదారులు ఎగబడి కొనడంతో కొన్ని గంటల్లోనే చేపలు అమ్ముడవడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

చేపల వేట

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని తాళ్లకుంట, బందంపల్లి చెరువుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల్లో మత్స్యకారులు చేపల వేటకు దిగారు. శనివారం మృగశిరకార్తె కావడంతో చేపలు కొనేందుకు పలు ప్రాంతాల్లో ప్రజలు కొనుగోలు చేశారు. అయితే శనివారం కావడంతో కొంత గిరాకీ తక్కువగానే ఉందని మత్స్యకార సంఘం అధ్యక్షుడు సారయ్య తెలిపారు.

జూలపల్లి: మృగశిర కార్తెను పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. మండల కేంద్రంలోని మందోట వద్ద, స్థానిక బస్టాండు వద్ద రెండు విక్రయాలు కేంద్రాలు పెట్టి చేపలను విక్రయించారు. దీంతో ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో చేపలు పట్టిన ముదిరాజ్‌లు అదే గ్రామంలో చేపల విక్రయాలు చేయడంతో ప్రజలకు అందుబాటులో చేపలు దొరికాయి.

ఎలిగేడు: మండలంలోని గ్రామాల్లో ప్రజలు చేపలు కొనుగోలు చేశారు. లాలపల్లి, ముప్పిరితోట, ధూళికట్ట తదితర గ్రామాల్లోని చెరువుల్లో మత్స్యకారులు చేపలు పట్టడంతో ప్రజలు చేపలను కొనుగోలు చేశారు.

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కెట్‌లో చేపల అమ్మకాలు జోరందుకున్నాయి. శనివారం మృగశిర కార్తె సందర్భంగా మార్కెట్‌లో చేపల అమ్మకాలు జోరందుకున్నాయి. బొచ్చ, రవు రూ.250నుంచి రూ.300, బొమ్మెకు రూ.550 కిలో ధర పలికింది.

పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలి



రామగుండం: గ్రామంలో బడిబాట ర్యాలీ

ఎలిగేడు: చిన్నారుల తల్లిదండ్రులు బడీడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరుతూ శనివారం మండలంలోని 12 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం చేపట్టారు. బడిమానేసిన పిల్లల వివరాలు సేకరించారు. ఎలిగేడు స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేందర్‌రావు, సుల్తాన్‌పూర్, ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంలు సదయ్య, నరేంద్రచారి, సీఆర్పీ లక్ష్మీనారాయణ, యూపీఎస్, పీఎస్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాజయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనతో ఒనగూరే లాభాలను పేరెంట్స్‌కు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో నిధులు కేటాయిస్తుందని, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ర్యాలీలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జింక మల్లేశం, గూడెపు రాజయ్య, గట్టు శ్రీనివాస్, రవి, తిరుపతి పాల్గొన్నారు.

అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి

కోల్‌సిటీ: అపోహలు వీడి నేత్రదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి పిలుపునిచ్చారు. గోదావరిఖనిలోని జవహర్‌నగర్‌కు చెందిన కొప్పుల నర్సమ్మ అనే వద్ధురాలు ఇటీవల మృతి చెందారు. కాగా మరో ఇద్దరికి చూపును ప్రసాదించడానికి ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. శనివారం నేత్రదాత సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేత్ర, అవయవ, శరీరదానంపై అవగాహన కల్పించారు. నేత్రదాత కుమారులు కొప్పుల శంకర్, నరహరి, కూతురు భూలక్ష్మికి అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారెల్లి రాజిరెడ్డి, మహంకాళి స్వామి, దీటి బాలరాజ్, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు కే.ఎస్.వాసు, నూతి సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేసిన 90 ఏళ్ల వృద్ధురాలు

కోల్‌సిటీ: స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన గోదావరిఖనిలో కాసర్ల అమృతమ్మ(90) అనే వృద్ధురాలు శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. కాగా శనివారం సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ సతీశ్ ద్వారా మృతురాలి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. అమృతమ్మ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, సలహాదారులు నూక రమేశ్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి, సభ్యురాలు చింతిరెడ్డి సంతోషరెడ్డి అభినందించారు.

ఆయన చూపు సజీవం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ టీ2–836 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న గుత్తుల శ్రీనివాస్(55)అనే సింగరేణి ఉద్యోగి అనారోగ్య సమస్యలతో సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ సతీశ్ ద్వారా శనివారం నేత్రాలను సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు భార్య నాగలక్ష్మి, కూతుళ్లు, అల్లుళ్లు విశాల–రాంబాబు, మీనా–ప్రవీణ్, సృజనను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సానా రామకృష్ణారెడ్డి, భీష్మాచారి, వాసు, కవిత అభినందించారు.

ఎమ్మార్సీ నుంచి ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ



రామగుండం: ఉమ్మడి రామగుండం మండల విద్యా వనరుల కేంద్రానికి 2024–25కు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. శనివారం మండల విద్యా వనరుల కేంద్రంలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య వారీగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, 6 నుంచి 10వ తరగతి వరకు నోట్‌బుక్స్, 1 నుంచి 5వ తరగతి వరకు వర్క్ బుక్స్ పంపిణీ ప్రారంభించారు. ఎంఈవో ఎ.రాజయ్య, సీఆర్పీలు తీగుట్ల శ్రీనివాస్, వాణిశ్రీ ఉన్నారు.

30బెంచీలు బహూకరణ

ధర్మారం: మండలంలోని నందిమేడారం జూనియర్ సివిల్ కోర్టుకు బార్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు శనివారం 30 బెంచీలను బహూకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కక్షిదారుల సౌకర్యం కోసం బెంచీలు మంజూరు చేయాలని కోరారు. కాగా వెంటనే మంజూరు చేసినట్లు అశోక్‌రెడ్డి తెలిపారు.

వేములవాడ గోశాలకు గడ్డి వితరణ

ముత్తారం: మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన ఎగుర్ల రాజు అనే రైతు వేములవాడ గోశాలకు 100వరిగడ్డి కట్టలను శనివారం వాహనంలో తీసుకెళ్లారు. గోశాలలోని ఆవులకు మేత అందించాలనే ఉద్దేశంతో వరిగడ్డిని తీసుకెళ్తున్నట్లు రాజు తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన పెంద్యం నగేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా మృతుడి కుటుంబ సభ్యులకు పద్మశాలీ సంఘం జిల్లా అడ్‌హాక్ కమిటీ నేతృత్వంలో కులబాంధవులు శనివారం బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు అందించి చేయూతనందించారు. పద్మశాలి సంఘం జిల్లా అడ్‌హాక్ కమటీ చైర్మన్ వలస నీలయ్య, కులపెద్దలు సబ్బని రాజమల్లు, శ్రీనివాస్, గోలి సుధాకర్, చందు, రవీందర్, రాజయ్య, వెంకన్న, అంబదాస్, నర్సయ్య, సంతోష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి, జీలకుంట గ్రామాల్లో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. సుల్తానాబాద్ వైపునకు వెళ్లే అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఆలయాలకు సంప్రదాయ దుస్తుల్లో రావాలి



ప్రదర్శనగా వస్తున్న రాజస్తానీ సేవాసమాజ్ మహిళలు

పెద్దపల్లిరూరల్: హిందూ ఆలయాల దర్శనానికి వచ్చే మహిళలు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తుల్లోనే రావాలని రాజస్తానీ మహిళా మండలి అధ్యక్షురాలు స్నేహలత మాలానీ, కార్యదర్శి మనీషా సోని, సోను కోరారు. పెద్దపల్లిలోని చాముండేశ్వరీదేవి ఆలయం నుంచి మొదలైన అవగాహన ర్యాలీని మార్వాడీ సేవాసమాజ్ అధ్యక్షుడు ఘన్‌శ్యాందాస్ జెండా ఊపి ప్రారంభించారు. పంజాబీ డ్రెస్ తదితర దుస్తులకు బదులుగా హిందూ సంప్రదాయ దుస్తుల్లో చీర ధరించి ఆలయాలకు రావాలని పిలుపునిచ్చారు.